ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

జిల్లా వార్తలు

5

బుధవారం 24 జూలై 2024



నిరాశే మిగిలింది

- కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం కరువు
- నిధుల కేటాయింపులపై అసంతృప్తి
- రైలు మార్గాలపై స్పష్టత కరువు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కేంద్ర బడ్జెట్‌పై ప్రజలు పెట్టుకున్న ఆశలు ఆవిర య్యాయి. బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ నోట తెలంగాణ అన్న పదమే వినిపించక పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతుండగా జిల్లా ప్రజలు అదే భావన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేకపోవడం ప్రజ లను నిరాశకు గురిచేసింది. సిద్దిపేట వరకు పూర్తయిన కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైనుకు నిధుల కేటాయింపు, కరీంనగర్ నుంచి హుజూరాబాద్, జమ్మికుంట మీదుగా కాజీపేటకు రైల్వేలైనుకు నిధుల విడుదల అంశాలు కేంద్ర మంత్రి బడ్జెట్ ప్రసంగంలో చోటు చేసుకుంటాయని ప్రజలు ఆశించారు. వాటి ప్రస్తావనే ఆమె ప్రసంగంలో లేదు. కొత్త జిల్లాలకు నవోదయ విద్యాలయాలు, కరీంనగర్‌లో ఐఐటీ ఏర్పాటు అంశంపై కూడా నీళ్ల వదులుకున్నట్లేనని భావిస్తున్నారు.

● ఆదాయపు పన్ను మినహాయింపుపై దక్కని ఊరట

అయిదు లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్న ప్రజలు, ఉద్యోగుల వినతిని కేంద్రం పట్టించుకోలేదు. సవరించిన స్లాబ్ రేట్లు కూడా పెద్దగా లాభం చేసేవిగా లేవు. దీంతో దిగువ, మధ్య తరగతిఉద్యోగులకు పన్ను కట్టా ల్సిన పరిస్థితి కొనసాగనున్నదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ మినహా రాజకీయ పక్షాలన్నీ బడ్జెట్ కేటాయింపులపై పెదవి విరుస్తుంటే ఆ పార్టీ మాత్రం బడ్జెట్ వికసిత్ భారత్ వైపు బాటలు వేస్తున్నదని ప్రశంసిస్తు న్నది. తెలంగాణ నుంచి ఎనిమిది మంది ఎంపీ లను బీజేపీ గెలుచుకున్నా, కేంద్రమంత్రి వర్గంలో రాష్ట్రం నుంచి ఇద్దరు మంత్రులుగా ఉన్నా ఈ ప్రాంత అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం లేక పోవడం తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తున్నది.



పెరిగేవి
- ప్లాస్టిక్ వస్తువులు
- సిగరెట్లు
- ప్లాటినం వస్తువులు

తగ్గేవి
- బంగారం, వెండి, వజ్రాల ఆభరణాలు
- ఎలక్ట్రిక్ వాహనాలు
- లీథియం బ్యాటరీలు
- సోలార్ ప్యానల్స్
- మొబైల్ ఫోన్లు, చార్జర్లు
- సైకిల్స్
- బొమ్మలు
- క్యాన్సర్ మందులు
- లెదర్ ఉత్పత్తులు



పేదప్రజల ఆశలపై నీళ్లు...

- కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు



మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరోసారి పేద ప్రజలపై తన కర్కశత్వాన్ని చూపించింది. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేవిధంగా మోదీ ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ప్రకటించిన ఎన్నికల హామీల అమలు మేరకు బడ్జెట్ నిధులు కేటాయించలేదు. ఈ బడ్జెట్ ద్వారా తెలంగాణ ప్రజలను వెన్నుపోటు పొడిచారని భావిస్తున్నాం.

వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్

- గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించి కేటాయింపులు చేశారు. నిరుద్యోగులు, రైతులు, గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా తొమ్మిది ప్రాధాన్య అంశాలను ఎంపిక చేసుకుంది. అన్నివర్గాలకు, దేశ అభివృద్ధికి బడ్జెట్ దోహదపడుతుంది.

రాష్ట్రానికి తీరని అన్యాయం

- కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎలాంటి నిధులు కేటాయించలేదు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో సామాన్యులకు ఎలాంటి ఉపశమనం లభించలేదు. ఈ బడ్జెట్ పెట్టుబడి దారులకు మాత్రమే అనూకూలంగా ఉంది.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- పి.సుగుణాకర్‌రావు, బీజేపీ సీనియర్‌నాయకుడు



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చింది. వ్యవసాయరంగానికి 1.53 లక్షల కోట్ల కేటాయింపు, ఉత్పాదకత, ప్రకృతి వ్యవసాయ పెంపు, సూక్ష్మమధ్యతరగతి పరిశ్రమల క్రెడిట్ గ్యారెంటీ పథకం, యువత ఇంటర్న్‌షిప్‌కు నిధుల కేటాయింపు, వర్కింగ్ ఉమెన్స్‌కు హాస్టల్స్ ఏర్పాటు వంటి చర్యలతో దేశాభివృద్ధి వేగంగా పెరుగుతుంది. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చిన బడ్జెట్ ఇది.

అన్ని రంగాలకు నిధులు కేటాయించడం హర్షణీయం

- చిట్టిమల్ల శ్రీనివాస్, కరీంనగర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, అధ్యక్షుడు



వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలకు నిధులను కేటాయించడం హర్షణీయం. ఆదాయపు పన్ను స్లాబ్ రేట్లను సవరించి ఉద్యోగులకు, వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు వెసులుబాటు కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం. గోల్డ్, సిల్వర్ కస్టమ్ డ్యూటీని ఆరు శాతానికి తగ్గించడంతో 10 గ్రాములకు రెండు వేల నుంచి మూడు వేల రూపాయల వరకు ధర తగ్గింది. దీంతో వినియోగదారులకు మేలు జరుగుతుంది.

అన్ని వర్గాలకు మేలు చేసే బడ్జెట్

- బాస సత్యనారాయణరావు, బీజేపీ సీనియర్ నాయకుడు



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా ఉంది. వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ సర్కార్ వ్యవసాయం, సంక్షేమం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు అన్ని రంగాలకు ప్రాధాన్యతమిస్తూ నిధులు కేటాయించారు. ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలకు ఊరట కలిగే విధంగా ఆదాయపు పన్ను స్లాబ్ రేట్‌ను సవరించారు.

బహుళజాతి సంస్థలకే లబ్ధి చేకూర్చే బడ్జెట్

- సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం నగర అధ్యక్షుడు



కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు, బహుళజాతి సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా ఉంది. పేద ప్రజల ఆశలు ఆవిరి చేశారు. జిల్లాకు నిధుల కేటాయింపుల విషయంలో ఎంపీ విఫలమయ్యారు. ప్రభుత్వం బడ్జెట్‌తో పేద ప్రజల వ్యతిరేక విధానాన్ని మరోసారి ప్రదర్శించింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

- మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి



కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలను వ్యవసాయ కార్మికులను గ్రామీణ పేదలను రైతులను, అసంఘిత కార్మికులను మధ్యతరగతి వర్గాలను నిరాశ పరిచింది. కార్పొరేట్ సంస్థలను సంతృప్తి పరిచే విధంగా బడ్జెట్ ఉంది. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్

ఉత్సవ విగ్రహాల్లా బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు

- మర్రి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపించింది. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు బండి సంజయ్‌కుమార్, కిషన్‌రెడ్డి ఉత్సవ విగ్రహాల్లా చూస్తు ఉండి పోయారు. బడ్జెట్ కేటాయింపుల్లో బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే అధిక ప్రాధాన్యమిచ్చారు.

ఉపాధి హామీ పథకం రద్దు దిశగా బడ్జెట్

- కొయ్యడ సృజన్‌కుమార్, బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే దిశగా కేంద్ర బడ్జెట్ ఉంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకానికి 88 వేల కోట్లు మాత్రమే ప్రకటించింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం లక్ష్యం నెరవేరదు. కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ కేటాయింపులు పెంచాలి.

ట్రిపుల్ ఐటీ ఊసేలేదు

- కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ మంజూరు ఊసే లేదు. గతబడ్జెట్‌తో పోల్చితే 4 వేల కోట్లు నిధులు తగ్గించారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా ప్రయోజనం లేదు. వెంటనే వారి పదవులకు రాజీనామా చేయాలి.

విద్యారంగాన్ని విస్మరించిన బడ్జెట్

- ఎస్ రజనీకాంత్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించింది. కేంద్ర విశ్వ విద్యాలయాలు అభివృద్ధికి ఇచ్చే యూజీసికి భారీగా నిధుల కోత పెట్టారు. విభజన హామీ చట్టం ప్రకారం కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ ఇవ్వాలి. డివిజన్‌కు ఒక నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలి.

■ భగత్‌నగర్

ఉద్యోగులకు నిరాశ కలిగించింది

- జాలి మహేందర్‌రెడ్డి, రిటైర్డు గెజిటెడ్ హెచ్ఎం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇన్‌కమ్ టాక్సుకు సంబంధించిన రాయితీల్లో ఎలాంటి మార్పు చేయలేదు. గతంలో మాదిరిగానే పన్ను విధానాన్ని కొనసాగించడం నిరాశను మిగిలించింది. ఐదు లక్షల వరకు కూడా పన్ను మినహాయింపు కల్పించక పోవడంతో ఉద్యోగులకు ఎలాంటి లాభం జరగదు.

తెలంగాణ అభివృద్ధిపై ప్రభావం

- దామరాజు వెంకట ప్రశాంత్‌రాయ్, సీఏ

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని కోసం 15,000 కోట్లు కేటాయించి హైదరాబాద్, ఇతర తెలంగాణ ప్రాంతాల అభివృద్ధికి గండి కొట్టారు. డైరెక్ట్ ట్యాక్సు చట్టాలపై రివ్యూ చేయాలనే ఆలోచన మంచిదే. మున్ముందు చట్టాల్లో చాలా మార్పులు రావచ్చు. మార్చిన ట్యాక్స్ స్లాబ్‌తో 20 లక్షల జీతం ఉన్న ఉద్యోగి సగటున 25వేల వరకు లాభం పొందుతారు

తెలంగాణను పట్టించుకోలేదు..

- బొమ్మ శ్రీరాంచక్రవర్తి, హౌస్‌ఫెడ్ మాజీ చైర్మన్

కేంద్ర బడ్జెట్‌లో కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీటవేశారు. ఏపీకి నిధుల వరదపారించి తెలంగాణ ముఖాన బురదచల్లారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలను గెలిపించిన ప్రజలకు మోదీ ప్రభుత్వం మొండిచేయి చూపించింది.

రాష్ట్రానికి అన్యాయం

- వెన్న రాజమల్లయ్య, టీపీసీసీ ఎస్సీసెల్ సీనియర్ వైస్ చైర్మన్

కేంద్ర బడ్జెట్ సామాన్య ప్రజల వ్యతిరేకంగా, బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా ఉంది. దేశం, ప్రజల అభివృద్ధికి కాకుండా ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు బడ్జెట్‌లో పక్షపాతం చూపారు. రాష్ట్రానికి రావాల్సిన విద్యాసంస్థలు, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఉక్కు ఫ్యాక్టరీకి ఎలాంటి కేటాయింపులు చేయలేదు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేశారు.

ఉత్తరాది రాష్ట్రాలకే పెద్దపీట

గుంజపడుగు హరిప్రసాద్, బీఆర్ఎస్ మీడియాసెల్ జిల్లా మాజీ ఇన్‌చార్జి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, ఉత్తరాది రాష్ట్రాలకు పెద్దపీట వేసి, తెలంగాణాకు మాత్రం తీవ్ర నిరాశను మిగిలిచ్చారు. గతంలో కేసీఆర్ సీఎంగా రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేసి తెలుగురాష్ట్రాలకు న్యాయం చేయాలని కోరినా కేంద్రం స్పందించలేదు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి

- గడ్డం విలాస్‌రెడ్డి, అర్బన్‌బ్యాంక్ పర్సన్ కమిటీ సభ్యులు, డీసీసీ అధికారప్రతినిధి

రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా తెలంగాణకు వారు ఒరగబెట్టింది ఏమీ లేదు. ఫర్టిలైజర్స్, పురుగుల మందులలో ఉపయోగించే నైట్రోజన్‌పైన కష్టం డ్యూటీ పెంచి రైతులు ఉపయోగించే ఎరువులు ధరలు పెరిగేలా చేశారు. ఎన్డీఏ అధికారంలో ఉన్న రాష్ట్రాలు, ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో మాత్రమే బడ్జెట్ పెంచారు. బడ్జెట్ తెలంగాణ ప్రజలకు నిరాశ మిగిల్చింది..

ఆదాయపు పన్ను నుంచి కొంత ఉపశమనం

- వాసాల శ్రీనివాస్, ఇన్‌కం టాక్స్ ప్రాక్టీషనర్

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి ఆదాయపు పన్ను నుంచి కొంత ఉపశమనం కలిగించారు. కేంద్ర బడ్జెట్ 48.21 లక్షల కోట్ల పరిమాణం భారీ బడ్జెట్‌ను సూచిస్తుంది. మొత్తం ఆదాయం 32.07 లక్షల కోట్లుగా అంచనా వేశారు. తగిన రాబడి లేకపోతే ప్రజలపై పన్నుల భారం పడే అవకాశముంది. పన్ను ఆదాయం 28 లక్షల కోట్లు, అప్పులు, పన్నేతర ఆదాయం 16 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ద్రవ్యలోటు 4.3 శాతం అనేది కొంత ఆందోళన కలిగించే అంశం. ద్రవ్యలోటును తగ్గించే మార్గాలు అన్వేషించాలి.

లో లెవల్ వంతెనలతో ఇబ్బందులు

భారీ వర్షాలు కురిస్తే నిలిచిపోతున్న రాకపోకలు

జిల్లాలోని పలు వాగులపై ఉన్న లోలెవల్ వంతెనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు వాగులు ఉప్పొంగి లో లెవల్ వంతెనలపైకి వరద నీరు చేరుతోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.



చొప్పదండి మండలం పందివాగుపై ఉన్న లో లెవల్ వంతెన

చొప్పదండి, జూలై 23: మండలంలోని పంది వాగుపై ఉన్న లోలెవల్ వంతనెతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారి వర్షాలు కురిసి నప్పుడు వంతెన మునిగిపోయి రాకపోకలు నిలిచిపోతు న్నాయి. మండలంలోని రెవెల్లి హెడ్‌రెగ్యూలేటర్ వద్ద కాకతీయ కాలువ ఎస్కేప్ నీటిని పందివాగులోకి వదిలి పెడతారు. ఆర్నకొండ నుంచి రాగంపేట మీదుగా గోపాల్ రావుపేట, పెగడపల్లికి రోడ్డు ద్వారా ప్రతి నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వాగుపై వంతెన నిర్మించాలని ప్రజలు అనేక సార్లు విన్నవిం చుకున్నా పాలకులు పట్టించుకోవడంలేదు.



శంకరపట్నం మండలం అర్కండ్ల వాగుపై ఉన్న వంతెనను ట్రాక్టర్లలో దాటుతున్న గ్రామస్తులు

అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

● **శంకరపట్నం:** మండలంలోని అర్కండ్ల సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆ నీరు లో లెవల్ వంతెనపై నుంచి పారుతుండడంతో రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ముత్తారం చెరువు నిండి మత్తడి దూకింది. ఈ నీరు మత్తడి కింద ఏర్పడ్డ వాగు ద్వారా ఎరడపల్లి దాటి అర్కండ్ల మీదుగా గద్దపాక దాటి కల్వల ప్రాజెక్టుకు వెళుతుంది. అర్కండ్లలో లో లెవల్ వంతెనపై నుంచి శంకరపట్నం మండలం నుంచి వీణవంక మండలంలోని పలు గ్రామాలకు ప్రజలు వెళు తుంటారు. ఈ వంతెనపై సంవత్సరంలో ఎనిమిది నెలలపాటు నిరంతరాయంగా నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. దీంతో బ్రిడ్జీ పైన నాచుపట్టి జారిపడి పలువులు వాహనదారులు గాయపడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలతో వాగు ఉధృతంగా ప్రవహి స్తోంది. దీంతో ప్రజలు ట్రాక్టర్లలో వంతెనను దాటుతున్నారు. ప్రభుత్వం స్పందించి అర్కండ్ల వాగుపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం

సుభాష్‌నగర్, జూలై 23: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పిలుపు నిచ్చారు. మంగళవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎస్టీ మైనార్టీ, బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వచ్చే నెల 5,6 తేదీల్లో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. జన గణనలో బీసీల కుల గణన చేయాలని, దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని, బీసీ క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని, ప్రమోషన్లలో బీసీ రిజర్వేషన్‌ను వర్తింపచేయాలని, బడ్జెట్‌లో బీసీలకు 20లక్షల కోట్లు కెటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో బీసీలు ఏడు శాతం కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయడంలేదన్నారు. బీసీ బిల్లుకు మద్దతు అన్ని రాజకీయ పార్టీలు తెలపాలని, మద్దతు తెలుపని ప్రభుత్వాలను గద్దె దింపుతామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి రాజ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు రమేశ్, నగర అధ్యక్షుడు మియాపురం రవీంద్రాచారి, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

'పెండింగ్ జీతాలు చెల్లించాలి'

సుభాష్‌నగర్, జూలై 23: ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నవీనకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించన డైరెక్టర్ కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తోపాటు, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పెండింగ్ జీతాలతోపాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పి అరుణ్, టి కళావతి, పి శారద పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

జమ్మికుంట, జూలై 23: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని హుండీ ధ్వంసం చేసిన దొంగలు 40 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.













వస్త్ర పరిశ్రమ మనుగడకు చర్యలు తీసుకోవాలి

ప్రజా సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 23 : సిరిసిల్ల వస్త్ర పరిశ్ర మనుగడ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిరిసిల్లలో చేపట్టిన నిరాహారదీక్షకు మద్దతు తెలుపుతూ ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరు నెలలుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో తొమ్మిది మంది కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. సంక్షోభ నివారణకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం మూలంగా వస్త్ర పరిశ్రమ నడవక కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుటీర పరిశ్రమగా ఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను బతుకమ్మ చీరల పేరుతో ఎస్ఎస్ఐ యూనిట్స్, మాక్స్ సంఘాలను పెట్టించిందని, మిగతా క్వాలిటీ గుడ్డను నడవకుండా పూర్తిగా లూమ్స్‌పై బతుకమ్మ చీరల మాత్రమే నడపాలని నిబంధన పెట్టి పాలిస్టర్, కాటన్ పరిశ్రమ మనుగడ లేకుండా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీని కొనసాగించాలని, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్, నేతన్న బీమా, నేతన్న చేయుత, వర్క్ టూ ఓనర్ పథకాలను అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, సీపీఐ జిల్లా నాయకుడు మీసం లక్ష్మణ్, విద్యార్థి సంఘం నాయకుడు అంగూర్ రంజిత్, దళిత సంఘాల నాయకులు మంగళి చంద్రమౌళి, రాజశేఖర్, మురళి, బాలరాజు, చంద్ర పాల్గొన్నారు.

కల్వల ప్రాజెక్టుకు గండి



గండి పడి దిగువకు పోతున్న నీరు

శంకరపట్నం, జూలై 23: శంకరపట్నం మండంలోని కల్వల ప్రాజెక్టుకు మంగళవారం గండి పడి నీరు దిగువకు పోతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరింది. మత్తడి దగ్గర కట్ట బలహీనంగా ఉండడంతో గండి పడింది. దీంతో ప్రాజెక్టులోని నీరు వృథాగా దిగువకు పోతోంది. గత సంవత్సరం వర్షాకాలంలో ప్రాజెక్టుకు గండి పడడంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. వేసవిలో పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేపట్టకపోవడంతో, తాత్కాలిక మరమ్మత్తులు చేసిన చోట కట్ట బలహీనపడి గండి పడింది. దీంతో కల్వల ప్రాజెక్టుపై ఆధారపడిన శంకరపట్నం, వీణవంక మండలాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.





ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 25,490 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,490 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్ర స్తుతం 23.122 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 52.948 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీ రథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 532 క్యూ సెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 16.944 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.155 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 23: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూన్ 2024లో నిర్వహించిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. పరీక్ష ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ యువకుడి మృతి

సుల్తానాబాద్, జూలై 23: సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి వద్ద రాజీవ్ రహదారిపై మంగళ వారం జరి గిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన గుండ్ల శ్రీనివాస్(27) ఉదయం బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరగా, సుల్తానాబాద్ మం డలం నర్సయ్య పల్లి వద్ద లారీ ఢీకొన్నది. ఈ ప్రమా దంలో అతను తీవ్రంగా గాయపడగా సుల్తానా బాద్ ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా మృతిచెంది నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన లారీ డ్రైవర్ బండ శివ నాగేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



అతిసారం.. ప్రమాదకరం

● డయేరియాతో డీ హైడ్రేషన్ ● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

అతిసారకు కారణాలు

బ్యాక్టీరియా, వైరల్ పరాన్న జీవుల వలన అతిసార వ్యాధి వస్తుంది. ఎక్కువగా మలం, కలుషిత నీటి వలన డయేరియా సోకుతుంది. తాగడానికి, వంట చేయడానికి సురక్షితమైన నీరు వాడక పోవడం, పారిశుధ్య లోపం వ్యాధికి ప్రధాన కారణం కావచ్చు. ఐదేళ్ల కంటే తక్కువ వయసు పిల్లల్లో వైరల్ వ్యాధి కారకాలు రోట వరస్, నోరో వైరస్, అడెనో వైరస్, బ్యాక్టీరియల్ వ్యాధి కారకాలలో ఎస్చెరియా కోలి, సాల్మోనెల్లా, షిగిల్లా ఉన్నాయి.

నివారణ చర్యలు

- సురక్షితమైన తాగు నీరు ఉపయోగించడం.
- వ్యక్తిగత, ఆహార పరిశుభ్రత పాటించడం.
- సబ్బుతో చేతులు కడుక్కోవడం.
- అంటు వ్యాధులపై అవగాహన కలిగి ఉండడం.
- రోటా వైరస్ టీకా వేసుకోవడం.
- పౌష్టికాహారం తీసుకోవడం.

వెల్గటూర్, జూలై 23: వర్షాకాలం వచ్చిందంటేనే వాతావరణ మార్పులతో పాటు సీజనల్ వ్యాధులు కూడా వ్యాపిస్తుంటాయి. బావులు, బోరు బావుల్లో కొత్త నీరు చేడంతో కలుషిత నీరు తాగడం వలన కూడా వ్యాధులు ప్రభలడానికి అవకాశం ఉంది. వర్షా కాలంలో ప్రభలే వ్యాధుల్లో అతిసార వ్యాధి ఒకటి. అతిసార వలన వాంతులు విరేచనాలు కలిగి శరీరం మొత్తం డీ హైడ్రేషన్ కావడంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. అతిసారం అతి ప్రమాదకరమైందని, దీని వలన ప్రాణాలకు ముప్పు వాటిల్లకూడదంటే అప్రమత్తత చాలా అవసరమని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత అత్యవసరమని పేర్కొంటున్నారు. అతిసార ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఎక్కువగా వస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించే అవగాహన లేకపోవడంతో చిన్నారులకు ఎక్కువగా సోకుతుంది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లల్లో పోషకాహార లోపం కూడా అతిసారం ప్రధాన కారణమని వైద్యాధికారులు అంటున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెరగడం, మెరుగైన వైద్య చికిత్స విధానాలు అందుబాటులోకి రావడంతో జిల్లాలో కొన్నేళ్లుగా అతిసార మరణాలు సంభవించలేదు.

అవగాహన అవసరం

అతిసార (డయేరియా) వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలి. డయేరియా సోకకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం. కలుషిత ఆహారం, కలుషిత నీరు, పారిశుధ్య లోపం అతిసార వ్యాధికి ప్రధాన కారణ మని చెప్పవచ్చు. సెప్టిక్ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు కూడా డయేరియాకు కారణం కావచ్చు. అతిసార వ్యాధి సోకిన వారికి సుమారు పక్షం రోజుల పాటు వాంతులు, విరేచనాలు ఉంటాయి. దీనితో శరీరంలో నీరు, లవణాలు కోల్పోయి ప్రాణాలకు ముప్పు కలుగవచ్చు. పోషకాహార లోపం, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు, గుండె, కిడ్నీ, షుగర్ సంబంధిత వ్యాధులు ఉన్న వారు అతిసార వ్యాధి బారిన పడే అవకాశం అధికంగా ఉంది.

డీ హైడ్రేషన్‌తో ప్రాణాలకు ముప్పు

డయేరియా సోకిన వారికి వాంతులు, విరేచనాలు కొన్ని రోజులు పాటు కొనసాగడంతో శరీరం డ్రై హైడ్రేషన్ కారణంగా ప్రాణాలకు ముప్పు వాటిల్లవచ్చు. తీవ్రమైన డీ హైడ్రేషన్ కారణంగా అపస్మారక స్థితికి వెళ్లే అవకాశం కూడా ఉంటుంది. విరేచనాలు కావడం వలన శరీరంలో నీటితో పాటు సోడియం, పొటాషియం, క్లోరైడ్ బై కార్బోనేట్ వంటి ఎలక్ట్రోలైట్లు కోల్పోతాయి. ద్రవ మలం, వాంతులు, మూత్రం, చెమట ద్వారా శరీరం నీటిని కోల్పోతుంది. నిరంతర విరేచనాలు, మలంలో రక్తం కనిపించినపుడు లేదా డీ హైడ్రేషన్ సాంకేతాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



అతిసార వ్యాధితో పాటు సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండాలంటే వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలి. బయటి ప్రదేశాలకు వెళ్లి వచ్చిన పుడు, మల, మూత్రాలు విసర్జించినపుడు చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలి. బయటి పదార్థాలు తినకూడదు. వాంతులు, విరేచనాలు అయినపుడు వైద్యులను సంప్రదించాలి. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. కొన్నేళ్లుగా జిల్లాలో డయేరియా మరణాలు లేవు. కోటి లింగాలలో డయేరియాతో మృతి చెందిన కేసు ఇటీవలే నమోదైంది.



కోటిలింగాలలో పరిసరాలు పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

బెల్ట్‌షాపు నిర్వాహకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జూలై 23: సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన కేశ సంతోష్ సోమవారం రాత్రి ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. రెండేళ్లుగా గ్రామంలో సంతోష్ బెల్టుషాపు నిర్వహిస్తుండగా, పది రోజుల క్రితం నుంచి మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెంచి అమ్ముతున్నారని, దాంతో తన వద్ద ఎవరూ అంత ధర పెట్టి మద్యం కొనుగోలు చేయడం లేదని, వ్యాపారులు ధరలు తగ్గించాలని తన స్టేటస్ లో పెట్టుకున్నాడు. దీంతో మద్యం సిండి కేట్ నిర్వాహ కులు తనకు ఫోన్ చేసి బెదరించారని సంతోష్ తన సెల్ఫీ వీడియోలో ఆరోపించాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా, సిండికేట్ గురించి అబ్కారీ సీఐ రఘునాథ్‌ను అడుగగా అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో ఆస్తినష్టం

పెద్దపల్లి రూరల్, జూలై 23 : పెద్దపల్లి మండలంలోని కనగర్తికి చెందిన ఏడెల్లి పద్మకు చెందిన ఇంటిలో విద్యుదాఘాతంతో ప్రమాదం చోటుకుంది. ఫైర్ ఆఫీసర్ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడెల్లి పద్మ వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా, ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 4లక్షల 50 వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు పేర్కొంది.

రైల్వే స్టేషన్లో ఒకరి మృతి

జమ్మికుంట, జూలై 23: జమ్మికుంట రైల్వే స్టేషన్ లోని టికెట్ బుకింగ్ కౌంటర్ హాల్‌లో నిద్రించిన ఓ వ్యక్తి మృతి చెందాడు. బీహార్ రాష్ట్ర నలంద జిల్లా పినిపర్‌కు చెందిన దినేష్ యాదవ్ (46) పట్టణంలోని ఓ రైస్ మిల్లులో కొంత కాలంగా పని చేస్తున్నాడు. మంగళ వారం స్వగ్రామం వెళ్లేందుకు రైల్వే స్టేషన్ చేరుకున్నాడు. టికెట్ బుకింగ్ కౌంటర్ హాల్‌లో నిద్రించాడు. చుట్టు పక్కల వారు లేపినా లేవక పోయే సరికి అధికారులకు తెలిపారు. వారు డాక్టర్‌ను పిలిచి పరీక్షించగా మృతి చెందాడని నిర్ధారించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంట ఉత్పత్తులకు మద్దతు ధరకు

చట్టబద్ధత కల్పించకపోవడం బాధాకరం

- దేశ వ్యాప్తంగా రైతు రుణ మాఫీని బడ్జెట్‌లో విస్మరించారు
- ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ ఊసే లేదు

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో పంట ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించకపోవడం బాధాకరమని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తమకు వరాలు ప్రకటిస్తారని అన్నదాతలు ఆశించినప్పటికీ నిరాశకు గురిచేశారన్నారు. రైతాంగాన్ని రుణ విముక్తులను చేయడానికి జాతీయ స్థాయిలో ప్రయత్నాలు బడ్జెట్‌లో చేయలేదని విమర్శించారు. అంబానీ, ఆదానీ లాంటి వారికి రూ. లక్షల కోట్లు రాయితీ కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించడం విచారకరమన్నారు. తీవ్ర అప్పుల్లో కూరుకపోయిన రైతాంగాన్ని రుణ విముక్తులను చేయడానికి కేంద్రం రుణమాఫీ కార్యక్రమం ప్రారంభించాల్సిన అవసరముందన్నారు.

గతంలో 2008 సంవత్సరంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రూ. లక్ష రైతు రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 15 సంవత్సరాల కాలంలో ఏ ప్రభుత్వం కూడా రుణమాఫీపై ఆలోచన చేయలేదని విమర్శించారు. ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ నిర్మాణ వ్యవహారాన్ని బడ్జెట్‌లో విస్మరించారన్నారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం వల్ల దక్షిణ భారతదేశం, ఉత్తర భారతదేశాన్ని కలిపే విధంగా సికింద్రాబాద్ - ఢిల్లీ లైన్ సుమారు వంద కిలో మీటర్ల దూరం తగ్గుతుందని, సుమారు రెండు గంటల సమయం ఆదా అయ్యే అవకాశాలున్నాయన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశం రైల్వే లైన్ కాదని, ఇంతటి ప్రాధాన్యత ఉన్న రైల్వే లైన్‌పై తెలంగాణ రాష్ట్రం పట్ల వివక్షత కాదా అని, దక్షిణ భారత దేశాన్ని బడ్జెట్‌లో విస్మరించారని విమర్శించారు. ఆంధ్రాకు సంబంధించిన అంశాలకు సుమారు రూ. 15 వేల కోట్లను బడ్జెట్‌లో మంజూరు చేశారన్నారు. గతంలో యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన తెలంగాణలో ఐటీఐఆర్ ప్రాజెక్టు పునరుద్ధరణకు బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తారని ఆశించామని ఎటువంటి ప్రస్తావన బడ్జెట్‌లో చేయలేదన్నారు. మూసి రివర్స్ ఫ్రంట్‌కు సంబంధించి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారని భావించామని కేంద్రం బడ్జెట్‌లో విస్మరించిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పాత్ర పోషించినప్పటికీ తెలంగాణలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సత్సంబంధాలు కొనసాగిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన స్పందన కనబడడం లేదని తెలిపారు.

స్థానిక సంస్థలు

ఆదాయాన్ని పెంపొందించుకోవాలి

- అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

కరీంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో ఆదాయాన్ని మరింత పెంపొందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. మంగళవారం కరీం నగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులతో స్థానిక సంస్థల విధులు-బాధ్యతలపై రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారుల నుంచి విధులు, బాధ్యతలు, ఆదాయం పెంచే మార్గాలపై సూచనలు సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులపైనే ఆధారపడకుండా సానికల సంస్థలు మరింత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్థానిక సంస్థల ఆర్థికంగా బలోపేతమైతేనే రాష్ట్రం, దేశం పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాకు అన్ని అంశాలపై అవగాహన ఉన్న కలెక్టర్ పమేలా సత్పతి దొరకడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. అధికారుల సూచనల మేరకు జిల్లా కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్న నమ్మకం ఉందని తెలిపారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి చర్యలు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

గ్రామాలు, పట్టణాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాల అభివృద్ధితోనే స్థానిక సంస్థలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. స్వశక్తి మహిళా సంఘాలు అప్పగించిన పనులను దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు, స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ పనులు అద్భుతంగా పూర్తి చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలను కోటీశ్వరులు చేసే కార్యక్రమంలో భాగంగా ముందుకెళ్తున్నామని వివరించారు. అన్ని అంశాలను చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఏం రమేష్, సంకెపెల్లి సుదీర్‌రెడ్డి, మాలోతు నెహ్రూనాయక్, రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం చంద్రకళ, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, పెద్దపెల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీపీఓ రవీందర్, జెడ్పీ సీఈవో లు శ్రీనివాస్, గౌతమ్‌రెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని డీఆర్డీవోలు, సీఈవోలు డీపీఓలు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రయోగాలు చేయాలి

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రెటరీ స్మితా సబర్వాల్

గ్రామాలు, పట్టణాల్లో ఆదాయం పెంచే మార్గాలపై అధికారులు కొత్త కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ సూచించారు. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు ఫైనాన్స్ కమిషన్ కీలకపాత్ర పోషిస్తుందని, ఇది తమ బాధ్యత అని పేర్కొన్నారు. కరీంనగర్ గడ్డ తనకెంతో ఇష్టమని తెలిపారు. మున్సిపాలిటీల్లో అనవసర ఖర్చులు తగ్గించుకుంటూ, ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు.



రాజయ్యకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

వసతిగృహాల్లో అవినీతి, అక్రమాలపై

విచారణ జరిపించాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసిపేద్ది శ్రీధర్‌రాజు



వినతి పత్రం చూపుతున్న కెసిపేద్ది శ్రీధర్‌రాజు

గణేశ్‌నగర్,జూలై 23: జిల్లా బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యుత్ బిల్లుల పేరిట లక్షలాది రూపాయల అవినీతి అక్రమాలపై విచారణ జరి పించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయదేవికి మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ సం ఘం ప్రధాన కార్యదర్శి కెసిపేద్ది శ్రీధర్‌రాజు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మానకొండూర్ బీసీ సమీకృత వసతి గృహంలో దాదాపు 40 లక్షల పైగా విద్యుత్ బిల్లుల పేరిట అధి కారులు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బాధ్యులందరిపై చర్యలు తీసుకోలేదన్నారు. 2018 నుంచి 2022 వరకు విద్యుత్ బిల్లులకు కేటాయించిన నిధులపై దాని వినియోగంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖకు పూర్తి స్థాయి అధికారులు లేకపోవడం వల్ల కార్యాలయంలో పని చేసే అడ్మినిస్ట్రేషన్ అధికారి తన ఇష్టారాజ్యంగా వ్యవహరించి తనకు అనుకూలంగా ఉన్న వారికి ఎక్కువ నిధులు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకొని బీసీ సంక్షేమ శాఖను కాపాడాలని అన్నారు.

ఇద్దరు చెయిన్ స్నాచర్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, జూలై 23: ఒక యువకుడి మెడలోని బంగారు చెయిన్‌ను దొంగలించిన ఇద్దరు చెయిన్ స్నాచర్లను అరెస్టు చేశామని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. ఏసీపీ వివరాల ప్రకారం....

కట్టరాంపూర్‌కు చెందిన సమంత్ కోతిరాంపూర్‌లో జరుగుతున్న బోనాలలో పాల్గొని ఈ నెల 17న ఉదయం 4 గంటలకు బైక్‌పై ఒంటరిగా ఇంటికి వస్తుండగా తిరుమల్ నగర్ రోడ్ నంబరు 6 వద్ద ఇద్దరు ద్విచక్రవాహనంపై వచ్చి సమంత్ మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు తెంపుకుని పారిపోయారు. బాధితుడు వెంటనే కరీంనగర్ ఒకటో టౌణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేప ట్టిన పోలీసులు మం గళవారం ఉజ్వల పార్క్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా బంగారు గొలుసు లభ్యమైంది. విచారించగా చెయిన్ స్నాచింగ్ చేసిన నేరం ఒప్పుకున్నారు.

నిందితులు హైదరాబాద్‌కు చెందిన బీటెక్ విద్యార్థి ఎండీ ఫైజాన్(22), మానకొండూర్‌కు చెందిన షేక్ సాహిద్ (22)లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బంగారు గొలుసు, ద్విచక్రవాహనం స్వాధీ నం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కమాన్‌పూర్, జూలై 23 : మండలంలోని గొరెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ధనవునేని అనిల్(30) వృతిరీత్యా ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ నెల 22న సాయం త్రం 4 గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగి పడిపోగా గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ధనవునేని నర సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వస్త్ర పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

మాజీ ఎమ్మెల్సీ చెరుపెల్లి సీతారాములు



సిరిసిల్లలో దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సీతారాములు

సిరిసిల్ల రూరల్, జూలై 23 : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు మంగళవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీతారాములుతోపాటు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూర పాటి రమేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూఉపాధిలేక మరమగ్గాల కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందని మండిపడ్డారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తొమ్మిది నెలలనుంచి సంక్షోభంలో కూరుకపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలన్నారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు సంబంధించి కరెంట్ సమస్య పెను శాపంగా మారిందన్నారు. పది హెచ్‌పీల వరకు ఉచిత కరెంట్ ఇచ్చి ఆ తర్వాత వాటికి నాలుగో కేటగిరి కింద 50 శాతం సబ్సిడీ కొనసాగించాలన్నారు. బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్‌లు ఇవ్వాలన్నారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని అందించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షో భానికి బాధ్యత వహించాలన్నారు. వస్త్ర పరిశ్రమపై జీఎస్టీని రద్దు చేయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమర్ సిరిసిల్ల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. సిరిసిల్ల నేతన్నలకు ఉపాధిని కల్పించే విధంగా కేంద్రం నుంచి ఆర్డర్లను తీసుకురావాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల సంక్షోభంపై మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతన్న సమస్యలకు పరిష్కారానికి కృషి చేయాలని, వారి బతుకులతో రాజకీయం చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఈ నెల 26లోగా సమస్యలను పరిష్కరించకుంటే ఇంటికో వ్యక్తి చలో హైదరాబాద్ తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు యెల్దెండి దేవాదాస్, గాజుల నారాయణ, ఏనుగుల ఎల్లయ్య, సిరిసిల్ల రవీందర్, ఎక్కలదేవి జగదీష్, శ్రీగాద మైసయ్య, చేరాల అశోక్, కోడం అశోక్, బండారి అశోక్, మ్యాన సత్యనారాయణ దీక్షలో కూర్చున్నారు. మూషం రమేష్, పంతం రవి, దామోదర్, మండల సత్యం, మోర రాజు, అడెపు భాస్కర్, కుమ్మరికుంట కిషన్, గోనె పర్శరాములు పాల్గొన్నారు.

వర్షంలో భోజనాలు చేస్తూ రాస్తారోకో

రిలే నిరాహార దీక్షల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా జేఏసీ ఆధ్వర్యంలో యజమానులు, ఆసాములు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు భోజనాలు చేస్తూ రాస్తారో చేపట్టారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ సైతం నిరసన తెలిపారు. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్



గణేశ్‌నగర్, జూలై 23: వినియోగ దారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా కరీంనగర్ సర్కిల్ పరిధిలో 189 కెపాసిటర్ బ్యాంకులు పెట్టినట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఇంకా 12 కెపాసిటర్ బ్యాంకులు పెట్టనున్నట్లు తెలిపారు. వోల్టేజ్‌లో హెచ్చుతగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంకులు ఉపయోగపడుతాయని అన్నారు. కెపాసిటర్ బ్యాంకులతో సబ్‌స్టేషన్, లైన్లలో విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కాకుండా నియంత్రిస్తున్నదన్నారు. సబ్ స్టేషన్‌లలో, అలాగే 11కెవి లైన్లలో కెపాసిటర్లు అమర్చడం వలన పవర్‌ఫాక్టర్ మెరుగుపడుతుందన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు, పారిశ్రామిక ఫీడర్లకు లోవోల్టేజ్ వలన మోటార్లు కాలిపోకుండా ఉండేందుకు కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతాయన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో పవర్ ఫ్యాక్టర్ ఘననీయంగా మెరుగు పరచడానికి కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతున్నాయన్నారు. టెక్నికల్ నష్టాలు ఘననీయంగా తగ్గుతాయన్నారు. పరికరాల మన్నిక చాలాకాలం పెరుగుతుందన్నారు. పారిశ్రా మిక వినియోగదారులకు కెపాసిటర్లు పెట్టు కోవడానికి ప్రోత్సహిస్తున్నామన్నారు. వీటి వలన ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం తగ్గి మోటార్లు కాలిపోకుండా మన్నిక పెరుగుతుందని తెలిపారు.

రోహన్ సంతాన సాఫల్య కేంద్రంలో ఉచిత ఐవీఎఫ్ క్యాంపు

సుభాష్‌నగర్, జూలై 23: ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 24 నుంచి 31 వరకు ఉచిత ఇన్‌ఫెర్టిలిటీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు రోహన్ ఫెర్టిలిటీ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎనమల్ల శ్రీదేవినరేశ్ తెలిపారు. క్యాంపులో ఉచిత కన్సల్టేషన్‌తోపాటు అవసరమయ్యే పరీక్షలు, స్కాన్‌పై 30 శాతం డిస్కౌంట్ అందజే స్తున్నట్లు తెలిపారు. క్యాంపులో రిజిస్ట్రేషన్ చేసుకున్న దంపతులకు ఐయూఐ ప్యాకేజీపై 50శాతం, ఐవీఎఫ్ ప్యాకేజీపై 25శాతం డిస్కౌంట్ ఇస్తామని తెలిపారు.

రేపు కామధేనువు సూపర్ బజార్ పాలకవర్గ ఎన్నికలు

కరీంనగర్ టౌన్, జూలై 23: నగరంలోని ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర వినిమయదారుల స్టోర్స్ లిమిటెడ్ (కామధేనువు సూపర్ బజార్) పాలకవర్గ ఎన్నికలు గురువారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన కూరగాయల మార్కెట్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ సమీపంలోని కామధేనువు సూపర్ బజార్‌లో ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ నమూనాలో ఎనిమిది డైరెక్టర్లను సూపర్ బజార్ సభ్యులు ఎన్నికునే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా బ్యాంకు అభివృద్ధికి, ఖాతాదారులకు అందించిన సేవలను గుర్తించిన ప్రజల ఆలోచన మేరకు ఈసారి కామధేనువు సూపర్ బజార్‌లో డైరెక్టర్‌గా పోటీచేస్తున్నానని తాటికొండ భాస్కర్ తెలిపారు. సభ్యులు తనకు అవకాశమివ్వాలని కోరారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

కరీంనగర్ టౌన్, జూలై 23: రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఆకాంక్ష మేరకు వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు చైర్‌పర్సన్‌గా ఆర్యవైశ్య ముద్దుబిడ్డ కాల్వ సుజాతను నియమించినందుకు ఆర్యవైశ్యుల పక్షాన ప్రభుత్వానికి నగరంలోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘాలు ఒక సంయుక్త ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో వేయి కోట్లరూపాయల నిధులను మంజూరీ చేసి ఆర్యవైశ్యుల అభ్యున్నతికి, పేద, మధ్యతరగతి వైశ్యకుటుంబాలకు మేలు చేయాలని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘాల ప్రతినిధులు రాచమల్ల భద్రయ్య, గజవాడ ఆంజనేయులు, యాంసాని అశోక్, మాదూరి మల్లేశం, డాక్టర్ దొంతుల మనోహర్, కొలిపాక శ్రీనివాస్, సామ లక్ష్మన్, పాత రాధాకిషన్, సూర శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

కరీంనగర్ రూరల్, జూలై23: కరీంనగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేశారు. వివిధ శాఖల్లో పనిచేసి నాలుగేళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా కరీంనగర్ మండలంలో పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను, మండల కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేశారు. తాహెర్ కొండాపూర్ కార్యదర్శి మమత స్థానంలో ప్రవళ్లిక, దుబ్బపల్లిలో పనిచేస్తున్న సరిత స్థానంలో సుజాత, చేగుర్తి కార్యదర్శిగా పనిచేస్తున్న రాజు స్థానంలో రాజ మల్లయ్య, మందులపల్లిలో కిరణ్‌కుమార్ స్థానంలో కిశోర్ విధుల్లో చేరారు. చామనపల్లి గ్రామ కార్యదర్శి ప్రభా కర్ స్థానంలో బదిలీపై వచ్చిన మహేందర్ రావు ఇంకా విధుల్లో చేరలేదు. అలాగే మండల పరిషత్‌లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ యండి అరీఫ్ బదిలీ కాగా ఆయన స్థానంలో మమత బదిలీపై వచ్చారు. బిల్ కలెక్టర్ రేణుక స్థానంలో శ్రీనివాస్ విధుల్లో చేరారు.

● బొమ్మకల్ వెటర్నరీ అసిస్టెంట్ లచ్చయ్య స్థానంలో విజయలక్ష్మీ, చేగుర్తి ఏవీవో సంధ్యారాణి స్థానంలో అర్చన, మొగ్దుంపూర్ జెవీవో సమయ్య స్థానంలో అరీఫ్ అహ్మద్, నగునూర్‌లో జీవీవో రాజు స్థానంలో సమయ్య బదిలీ అయ్యారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో అచీవర్స్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్‌స్పోర్ట్స్‌జూలై 23 : కోతిరాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు హైదరాబాదులోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ కరాటే టోర్నమెంట్లో పాల్గొని అత్యధిక పతకాలు సాధించారు. ఇందులో బి. ఆరాధ్య, ఎం.తేజ, బి.సుభాష్, ఈ.అశ్వంత్, బి. రేవంత్‌కుమార్ కె .చరణ్‌తేజ్, అయాన్,సుప్రతిక్‌లు ప్రతిభ కనబరిచి పతకాలు గెలుపొందారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సి.హెచ్.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్‌సి.హెచ్. పల్లవి అభినందించారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై పోస్టర్ ఆవిష్కరణ

గణేశ్‌నగర్, జూలై 23: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మత్తు పదార్థాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సు పోస్టర్‌ను మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, మైన్స్ అండ్ జియాలజీ సెక్రటరీ సురేంద్ర మోహన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా సాహితీ ఫౌండేషన్ వారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో చేపట్టనున్న అవగాహన సదస్సులు, పునరావాస కార్యక్రమాలను అభినందించారు. సాహితీ ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు కుమార్, సంతోష్ కుమార్, సంఘ సభ్యులు మారుతి, శ్రీకాంత్, సజ్జన్, వేదాంతం పవన్ కుమార్‌శర్మ, రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఇల్లందకుంట, జూలై 23: మండలంలోని వంతడుపుల, బూజునూర్, సీతంపేట, రాచపల్లి, మల్లన్నపల్లె గ్రామాల్లో కొత్తగా పట్టాదారు పుస్తకం వచ్చిన వారు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి రాకేష్ మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. ఇది వరకే ఉన్న రైతులకు మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ఈ నెల 30వ వరకు గడువు ఉన్నదని తెలిపారు. రైతులు తమ పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు, దరఖాస్తు ఫారంతో ఏఈవోను సంప్రదించాలన్నారు.

నేడు రాజ్యసభ మాజీ సభ్యుడు రాజేశ్వర్‌రావు వర్ధంతి

హుజూరాబాద్, జూలై 23: పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద రాజ్యసభ మాజీ సభ్యుడు వొడితెల రాజేశ్వర్‌రావు వర్ధంతిని బుధవారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, వెలిచాల రాజేందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కొడూరి సత్యనారాయణగౌడ్ హాజరై రాజేశ్వర్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తైక్వాండో అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడిగా యాదయ్య

జమ్మికుంట రూరల్, జూలై 23: పట్టణానికి చెందిన సీనియర్ కరాటే మాస్టర్ కోహిషి సుంకరి యాదయ్యను ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినట్లు ఇంటర్నేషనల్ అధ్యక్షులు జయంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో నియామక పత్రాలు అందజేశారన్నారు.

'ప్రభుత్వ హాస్టళ్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి'

హుజూరాబాద్, జూలై 23: రాష్ట్రంలోని సర్కార్ హాస్టళ్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లోని ప్రభుత్వ హాస్టళ్లను పరిశీలించి, విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఇప్పటికీ విద్యార్థులకు కావాల్సిన వస్తువులు ఇవ్వలేదన్నారు. మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, కృష్ణ, అరుణ్, అనుదీప్ పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి'

హుజూరాబాద్, జూలై 23: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అభిలాష్ డిమాండ్ చేశారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగాన్ని నిర్లక్ష్య చేసిందన్నారు. విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సందీప్, రాకేష్, వంశీ, స్పందన్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

జమ్మికుంట, జూలై 23: ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టడంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం వికసిత్ భారత్ లక్ష్యంగా పని చేస్తోందని, దానికి అనుగుణంగానే ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి

గన్నేరువరం, జులై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి చూపిందని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి కుర్చీని కాపాడుకోవడానికి మాత్రమే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు.

బీజేపీ బీసీలకు చేసింది ఏమిటో చెప్పాలి

కరీంనగర్ అర్బన్, జులై 23: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రస్తుత కేంద్రమంత్రి పది సంవత్సరాల పాలనలో బీసీల కోసం చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదన్న వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే బీసీ కుల జన గణనకు అసెంబ్లీలో ఆమోదం తెలిపిన కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి గంగాడికి లేదన్నారు. బీజేపీ 10 సంవత్సరాల పాలనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా, ఎంపీ, కేంద్ర సహాయ మంత్రిగా కొనసాగుతున్న బండి సంజయ్‌తో బీసీలకు ఒరిగిందేమిటో గంగాడి కృష్ణారెడ్డి స్పష్టం చేయాలన్నారు. గంగాడి కృష్ణారెడ్డి తన అధ్యక్ష పదవిని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తూ ఉనికిని చాటుకోవాలనుకుంటున్నారని విమర్శించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో వంద రోజుల్లోనే రాష్ట్రంలో బీసీ కులజన గణనకు అసెంబ్లీ సాక్షిగా ఆమోదం తెలుపడం గొప్ప విషయమన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేసిన న్యాయంపై బీజేపీ 10 సంవత్సరాల పాలనలో చేసిన న్యాయంపై శ్వేతపత్రం విడుదల చేసేందుకు



మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్

సిద్ధమని, ఇందిరాచౌక్ వేదికగా తేల్చుకుందామని సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రంలో ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నప్పటికీ నేడు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు బడ్జెట్ కేటాయించకపోవడం పట్ల సిగ్గుపడాలన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రామిడి రాజిరెడ్డి, లింగంపల్లి బాబు, నూనె గోపాల్‌రెడ్డి, ఎస్‌కే సిరాజ్ హుస్సేన్, పోతుగంటి శ్రీనివాస్, మొలుగూరి రాజశేఖర్ పాల్గొన్నారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం

కరీంనగర్ అర్బన్, జూలై 23: కరీంనగర్ కలెక్టరేట్‌లో 2024 ఆర్థిక సంవత్సరంపై ఆర్థిక శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు సిరిసిల్ల రాజయ్యకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఘనంగా స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, కరీంనగర్ అర్బన్‌బ్యాంక్ పర్సన్‌కమిటీ అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ పులి అంజనేయులుగౌడ్, నాయ కులు రాజిరెడ్డి తదితరులు చైర్మన్ రాజయ్యను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చెస్ టోర్నమెంట్

సుభాష్‌నగర్, జూలై 23: వాసవి క్లబ్ రీజియన్ ఆధ్వర్యంలో చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. మంగళవారం జీనియస్ చెస్ అకాడమీ, వాసవి కరీంనగర్ రీజియన్ లెవెల్‌లో చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. అక్కినపెల్లి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో వాసవి క్లబ్ వాగ్దేవి, వనిత కపుల్స్, ఎమ్మార్, కట్టరాంపూర్, శాతవాహన క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రీజియన్ కార్యదర్శి నవీన్, బొడ్ల సంతోష్, మాడి శెట్టి ఉమ, లక్ష్మీనారాయణ, నూనె పద్మ, సతీష్ బాబు, రాధిక, లత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 26న జాబ్ మేళా

గణేశ్‌నగర్,జూలై 23: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఈ నెల 26న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, వి.శ్రీధర్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు 26 శుక్రవారం రోజున తమ బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హతల జిరాక్సు ప్రతులను తీసుకొని ఉదయం 10 గంటలకు ఈజీఎంఎం కార్యాలయం, స్వశక్తి కళాశాల, అంబేద్కర్ స్టేడియం పక్కన, కరీంనగర్‌లో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు..

ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జాబ్ మేళా

గణేశ్‌నగర్, జూలై 23: జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులకు వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఈ నెల 26న ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. ఇంటర్ డిగ్రీ, పాసైన విద్యార్థినీ విద్యార్థులు వారి బయోడేటాతో పాటు సర్టిఫికెట్లు జిరాక్స్‌కాపీలు తీసుకొని ఈనెల 26న శుక్రవారం జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. ఎంప్లాయిమెంట్ కార్యాలయం కరీంనగర్, ఎస్సార్ కళాశాల ఎదురుగా జగిత్యాల రోడ్, కరీంనగర్ నందు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 9390751312,7207659969,9908230384 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సేవలకు గుర్తింపు

సుభాష్‌నగర్, జూలై 23: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జిలో నిర్వహించిన సేవలకు గుర్తింపు లభించింది. కరీంనగర్ మానేరు లయన్స్‌క్లబ్ 320జి, మల్టిపుల్ బెస్ట్ మెంబర్‌షిప్ గ్రోత్ అవార్డు, ట్రోఫీని మల్టిపుల్ కౌన్సిల్ చైర్మెన్ హనుమండ్ల రాజిరెడ్డి, ప్రస్తుత గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు అందుకున్నారు. అంతేకాకుండా బెస్ట్ ప్రెసిడెంట్‌గా గుండా రాజశేఖర్, బెస్ట్ సెక్రటరీగా వరాల జగన్, బెస్ట్ ట్రెజరర్ మహమ్మద్ అక్బర్ మెమెంటోలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహరాజు కోదండరాములు, మొర భద్రేశం, షైక్రో కేబినెట్ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులను కించపరిచిన వారిపై చర్య తీసుకోవాలి



పోలీస్‌కమిషనరేట్ వద్ద దివ్యాంగులు



వీణవంక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వికలాంగులు

కరీంనగర్ క్రైం, జూలై 23 : దివ్యాంగుల మనోభావాలు కించపరిచే విధంగా వాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారిని, సినీ డైరెక్టర్ రాజమౌళిలపై చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొగిలి లక్ష్మయ్య, కార్యదర్శి నందగిరి జగదీశ్వరాచారిలు తెలిపారు. సివిల్స్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్ అవసర మా అని వ్యాఖ్యానించిన ఐఏఎస్ అధికారిణి స్మితాసభర్వాల్‌తో పాటు, చదువకోని వారంతా దివ్యాం గులతో సమానమని చులకనగా వాఖ్యలు చేసిన సినీ డైరెక్టర్ రాజమౌళిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

● జమ్మికుంట రూరల్: దివ్యాంగుల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ వెంటనే క్షమాపణలు చెప్పాలని జమ్మికుంట దివ్యాంగుల సంఘం అధ్యక్షులు నేరుపాటి రవి అన్నారు. మంగళవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శనిగరపు రమేష్, కోశాధికారి ముత్యాల రంగయ్య, సహాయ కార్యదర్శి పొన్నాల రాజయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● వీణవంక: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై కేసు నమోదు చేయాలని మండల వికలాంగులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగ సంఘం అధ్యక్షుడు పైడిమల్ల శ్రీనివాస్, పులి ప్రకాశ్, పోతరవేన సమ్మయ్య, పి కూమారస్వామి, వెంకట చలం, సబ్బని శ్రీనివాస్, రాయిశెట్టి సదానందం,సంపత్,సంజీవ్‌రావు, అశోక్ ,మడ్డి రాజు, కొరకంటి రాజు,మారముళ్ల కొంరయ్య, తిరుపతి తదితరులున్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

శంకరపట్నం/వీణవంక/ మానకొండూర్, జూలై 23: కాంగ్రెస్ పార్టీ ఎన్నిలకు ముందు ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్‌ను చేయాలని కోరుతూ శంకరపట్నం, వీణవంక, మానకొండూర్ తహసీల్దార్లకు బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీలన్నీ రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని వారు కోరారు.

కార్యక్రమంలో నాయకులు గౌరవేణి శ్రీనివాస్ అలివేలు సమ్మిరెడ్డి, దండు కొంరయ్య, జైపాల్, సారయ్య, సాగర్, శివారెడ్డి, శ్రీనివాస్, రాజు, కొండాల్‌రెడ్డి, ప్రశాంత్, బత్తిని నరేష్, బొంగొని ఎల్లాగౌడ్, ఉడుత కూమార్, రవిబాబు, రంగు భాస్కరాచారి, రాపాక ప్రవీణ్ పాల్గొన్నారు.



శంకరపట్నంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అంజేస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



పత్తి చేనును పరిశీలిస్తున్న ఏవో యాస్మిన్

రామడుగు, జూలై 23: మండలంలోని దత్తోజీపేటలో వర్షానికి దెబ్బతిన్న పత్తి పంటలను ఏవో యాస్మిన్ మంగళవారం పరిశీలించారు. ఆమె వెంట ఏఈవో రాజేష్ ఉన్నారు.

ఆన్‌లైన్ సెంటర్‌లో చోరీ

మానకొండూర్, జూలై 23: మండల కేంద్రంలోని మణికంఠ ఆన్‌లైన్ సెంటర్‌లో సోమవారం రాత్రి దొంగతనం జరిగినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొత్తకొండ రాములు మణికంఠ ఆన్‌లైన్ సెంటర్‌ను నడిపిస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం షాపును తెరిచే సరికి కలర్ ప్రింటర్, నాలుగు వేల రూపాయలు చోరికి గురయ్యాయని గుర్తించాడు. రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఇల్లందకుంట, జూలై 23: మండలంలోని లక్ష్మాజిపల్లెకు చెందిన ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఎస్ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాజిపల్లెకు నల్లా రవీందర్‌రెడ్డి (63) అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. కొద్ది రోజుల క్రితం కాలుకు గాయమై ఇన్‌ఫెక్షన్ సోకింది. వైద్యులు ఆ కాలును తీసి వేశారు. దీంతో మానసికంగా కుంగిపోయిన రవీందర్‌రెడ్డి సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చిగురుమామిడి, జూలై 23: పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కార్యకర్తలను, నాయకులను, వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గోగురి మురహరిరెడ్డి తల్లి పోచమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మురహరిరెడ్డి కుటుంబసభ్యులను శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన కార్యకర్త ముడికె ఐలయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య నాయకులు పెనుకుల తిరుపతి, సంపత్‌రెడ్డి, ముస్కుల సుధాకర్‌రెడ్డి, ముస్కుల కిష్టారెడ్డి, ఒంటెల ఇంద్రసేనారెడ్డి, ముసాపూరి అశోక్, ముక్కెర సదానందం, అనిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఎల్‌వోసీ

సైదాపూర్, జూలై 23: మండల కేంద్రానికి చెందిన దాసరి పవన్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆస్పత్రికి వెళ్తే శస్త్ర చికిత్స చేయాలన్నారు. పవన్‌ది నిరుపేద కుటుంబం కావడంతో డబ్బులు లేక ఇబ్బంది పడ్డాడు. పవన్ కుటుంబసభ్యులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్‌ను కలిశారు. ఈ విషయాన్ని సుధాకర్ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి శస్త్ర చికిత్సకు అవసరమయ్యే 2.50 లక్షల రూపాయలకు ఎల్‌వోసీ ఇప్పించారు. పవన్ కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనారోగ్యంతో బాధ పడుతున్న వారు సీఎం రిలీఫ్ ఫండ్ ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు. కార్యకర్తలు సీఎం రిలీఫ్ ఫండ్ అవసరం ఉన్న వారిని తన వద్దకు తీసుక వచ్చి సహాయం అందేలా చూడాలన్నారు.

వైకుంఠధామానికి మరమ్మతులు కరువు



వైకుంఠధామంలో దెబ్బతిన్న గద్దె

మానకొండూర్, జూలై 23: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం పైకప్పు ఐదేళ్ల క్రితం ఈదురు గాలులకు లేచిపోయింది. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మానేరు వాగు పక్కన వైకుఠధామాన్ని నిర్మించారు. నిర్మించి రెండేళ్లయినా గడవక ముందే ఈదురుగాలులకు పైకప్పు పూర్తిగా లేచిపోయింది. ఇది జరిగి ఐదేళ్లు గడిచింది. వైకుంఠధామానికి మరమ్మతులు చేయాలని గ్రామస్థులు అధికారులకు, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదు. దింపుడు కల్లం గద్దె, మృతదేహాలను దహనం చేసే ప్రదేశం, ప్రవేశద్వారం పూర్తిగా దెబ్బతిన్నాయి. పిచ్చి చెట్లు మొలిచి లోపలికి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామస్థులు ఎవరైనా మృతి చెందితే వారివారి పొలాల్లో దహన సంస్కారాలు చేసుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైకుంఠధామానికి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ

భగత్‌నగర్, జూలై 23: కరీంనగర్ ఆర్టీసీ జోనల్ ఆసుపత్రి కాంటాక్ట్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ జయిద వసుధ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మెట్‌పల్లి డిపో మేనేజర్‌గా నియమితులైన టి దేవరాజు రిపోర్టు చేసి బాధ్యతలు చేపట్టారు. కాంటాక్ట్ మెడికల్ ఆఫీసర్ వసుధ, మెట్‌పల్లి డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చిన దేవరాజులు ఆర్టీసీ జోనల్ ఈడి వినోద్‌కుమార్, ఆర్ఎం సుచరితలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో కాంటాక్ట్ వైద్యుడు కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అధిక శాతం నిధులు కేటాయించాలి

గణేశ్‌నగర్,జూలై 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024-25, ఆర్థిక సంవత్సరం సంబంధించి బడ్జెట్‌లో విద్యకు అధిక శాతం నిధులు కేటాయించాలని, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ కోరారు. కేంద్ర బడ్జెట్లో 10శాతం, రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటా యించి విద్యారంగానికి అధికప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

రైతు నేస్తం ప్రారంభం

కరీంనగర్ రూరల్, జూలై23: రైతు నేస్తం కార్యక్రమాల ద్వారా రైతులకు సూచనలు సలహాలు ఇస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ రణదీర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలో రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు పత్తి పంటలో చీడ పీడల నియంత్రణపై వీడియో కాన్ఫరెన్స్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి. సత్యం, ఏఈవోలు అనుజ్ఞ, పైడితల్లి, స్వర్ణలత, ప్రణయ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

● మండలంలో వానాకాలం పంటల సాగు చేసిన పంటల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ఎడీఏ రణదీర్ కుమార్ సూచించారు. మంగళవారం కరీంనగర్ మండలం ఇరుకుల్ల, కమాన్‌పూర్, చెర్లబూత్కూర్, గ్రామాల్లో చేపట్టిన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఘనంగా శీత్లా భవానీ పండుగ

కరీంనగర్ కల్చరల్, జూలై 23: నగర శివారులోని మానేరు కట్ట కింద మంగళవారం గిరిజనులు ప్రకృతి ఆరాధన సంప్రదాయ పండుగైన శీత్లా భవానీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుగ్గులోతు రాజునాయక్, భూక్య తిరుపతినాయక్, గుగ్గులోతు తిరుపతినాయక్, మాలోతు రామచంద్రనాయక్, గుగ్గులోతు రవినాయక్, అనసూయబాయి, బానోతు సేవియానాయక్, బానోతు రాజునాయక్, గుగ్గులోతు శివరాజునాయక్, లక్ష్మీనాయక్, దేవేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

కరీంనగర్ కల్చరల్, జూలై 23: నగరంలోని కట్టరాంపూర్ మహాలక్ష్మీ గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సుదర్శనహోమం, హనుమత్‌వాహనసేవ ఘనంగా జరిగాయి. సాయంత్రం పుష్కరిణిలో శ్రీవారి తెప్పోత్సవం కన్నుల పండువలా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు జోగినపల్లి పద్మా అశోక్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

భగత్‌నగర్, జూలై 23: భగత్‌నగర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సిరిపురం ప్రసాద్ ఆధ్వర్యంలో సైదాపూర్ మండలం వెన్నంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బెల్టులు, టైలు అందించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్ వెన్నం రాజిరెడ్డి, సభ్యులు మిట్టపల్లి జయానంద్, మామిడాల రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు వీరారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ. 7,200 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 23:జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,200 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఒక రైతు 15 క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్ వేలం ద్వారా క్వింటాల్‌కు 7,200 రూపాయలు చెల్లించి కొన్నాడు.

క్యాంపు కార్యాలయాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, జూలై 23: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా కూలగొట్టారని, దీనిపై ఇప్పటి వరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదంటూ రంగాపూర్ మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు బింగి కరుణాకర్ కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ధ్వంసం చేసిన వారిపైచర్య తీసుకోవాలని కోరారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి

ఇల్లందకుంట, జూలై 23: ప్రస్తుత పరిస్థితుల్లో వరి, పత్తి పంటలో నీరు నిల్వ లేకుండా చూడాలని హుజూరాబాద్ ఏడీఏ సునీత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికల్లో రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో నెలకొన్న పరిస్థితులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడీఏ సునీత హాజరై మాట్లాడారు. రైతులు తెగులు నివారణకు సస్య రక్షణ చర్యలు పాటించాలన్నారు. ఈ నెలాఖరు వరకు వరి పంట వేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో గుర్రం రజిత, ఏఈవోలు నీల తిరుపతి, రాకేష్ పాల్గొన్నారు.

రామడుగు వంతెనకు మరమ్మతులు

రామడుగు, జూలై 23: మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన వంతెనకు మంగళవారం తాత్కలిక మరమ్మతులు చేపట్టారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు రామడుగు పోలీస్ సహకారంతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ మామిడాల సురేందర్, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, మాజీ సర్పంచ్ కోల రమేష్ ఉన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌పై అవగాహన

చొప్పదండి, జూలై 23: నవోదయ విద్యాలయంలో, రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల పదోన్నతులకు కృషి'

హుజూరాబాద్, జూలై 23: ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం కృషి చేస్తామని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిర్సపల్లి, చెల్పూర్, కందుగుల, పెద్దపాపయ్యపల్లి, కనుకుల గిద్దె పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు ఆగస్టు 15 తర్వాత చెల్లించడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆగన్న, పవన్, సాంబమూర్తి, లింగారెడ్డి, మాధవరావు, సంజీవరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.